సాక్షి
నిజామాబాద్
బుధవారం । 10 । జనవరి । 2024

గరిష్టం/కనిష్టం
32.0 /17.7

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

‘అర్జున’ అందుకోవడం.. మరువలేని ఘట్టం

బాక్సర్ హుస్సాముద్దీన్

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రపతి చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకోవడం జీవితంలో మరువలేని ఘట్టమని బాక్సర్ హుస్సాముద్దీన్ సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే అర్జున అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉంది. నా శ్రమకు తగిన గుర్తింపు లభించింది. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధిస్తాను. నా తండ్రి శంషొద్దీన్ వద్ద బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుని ఈ స్థాయికి వచ్చాను. నేను ఇక్కడ వరకు చేరుకోవడంలో నా తండ్రితో పాటు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది.

అభినందనల వెల్లువ

క్రీడాభిమానుల్లో హర్షాతిరేకాలు

హుస్సాముద్దీన్ అర్జున అవార్డు అందుకోవడంపై క్రీడాభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలోని బాక్సింగ్ క్రీడాకారులు, అథ్లెటిక్స్ గోల్డ్‌మెడలిస్టు సయ్యద్ ఖైసర్, ఒలింపిక్ సంఘం చైర్మన్ సంజీవరెడ్డి, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఇతర క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

గర్వంగా ఉంది

బాక్సింగ్‌లో మన జిల్లాకు వరుసగా రెండు సార్లు అర్జున అవార్డులు వచ్చాయి. గతేడాది నిఖత్‌కు, ఇప్పుడు హుస్సాముద్దీన్‌కు పురస్కారం దక్కడం గర్వంగా ఉంది. నా దగ్గర శిక్షణ తీసుకుని దేశానికి పతకాలు సాధించే స్థాయి కి ఎదిగినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం క్రీడాకారులను గుర్తించినందుకు మన స్ఫూర్తిగా అభినందనలు. క్రీడాకారులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే దేశానికి ఎన్నో పతకాలు తీసుకువస్తారు. – శంషొద్దీన్, బాక్సింగ్ కోచ్



అర్జున అవార్డుతో హుస్సాముద్దీన్ పక్కన తండ్రి శంషొద్దీన్

న్యూస్‌రీల్

30 రోజులు.. 52 లక్షలు

- మహాలక్ష్మి పథకంలో మహిళల ఉచిత ప్రయాణం
- బస్సుల్లో 65 శాతం మహిళలే



ఖలీల్‌వాడి: మహాలక్ష్మి పథకం ప్రారంభించి మంగళవారం నాటికి 30 రోజులు పూర్తికాగా ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో ఇప్పటివరకు 52 లక్షల మంది మహిళలు ప్రయాణించారు. డిసెంబర్ 9న ఈ పథకాన్ని ప్రారంభించగా.. డిసెంబర్ 15 నుంచి మహిళలకు జీరో టిక్కెట్ అందించారు. గతంలో ఆక్యుపెన్సీ రేటు 63శాతం ఉండగా ఇప్పుడు 81 శాతానికి పెరిగింది. ప్రతిరోజూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరుడిపోల పరిధిలో 2.50 లక్షల మంది ప్రయాణిస్తుండగా.. వీరిలో 65శాతం మంది మహిళలని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మహిళలు ఎక్కువగా హాస్పిటల్, ఫంక్షన్లకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

కేంద్ర పథకాలు అర్హులందరికీ చేరాలి



ఇందల్వాయి: కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి ఐఏఎస్ అశ్విని శ్రీవాస్తవ అన్నారు. అన్సాన్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే యాత్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఉన్నతి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తోందని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పథకాల లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బి.ధర్మానాయక్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో రాములు నాయక్, సర్పంచ్ గంగవ్వ, అధికారులు పాల్గొన్నారు.

పంటల వివరాలను నమోదు చేయాలి



బాల్కొండ: పంటల వివరాల నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. ముప్కాల్ మండలం వేంపల్లిలో పంటల వివరాల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలు సర్వే నంబర్ల ప్రకారం పక్కాగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే వివరాలు నమోదు చేయాలన్నారు. రైతులు అందుబాటులో ఉండేలా స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. లెక్క తప్పుగా ఉంటే పంట విక్రయ సమయంలో అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆయనవెంట వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ ఎట్టం మహేశ్, ఏఈవోలు తదితరులున్నారు.

జీజీహెచ్‌లో కార్మికుల సంఖ్యను పెంచాలి



ఖలీల్‌వాడి: జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్)లో కార్మికుల సంఖ్యను పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మంగళవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీజీహెచ్, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిని 1000 పడకలకు పెంచాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఎండీ హైమది, కోశాధికారి భాగ్యలక్ష్మి, నాయకులు నర్సయ్య, వెంకటేశ్, లలిత, స్వరూప, భారతి పాల్గొన్నారు.

మా వాటా మాకివ్వండి..



- పశు సంవర్ధక శాఖకు క్యూ కడుతున్న లబ్ధిదారులు
- కట్టిన డబ్బులు తిరిగివ్వాలని అధికారులపై ఒత్తిడి
- గొర్రెల పంపిణీపై స్పష్టత ఇవ్వని కొత్త ప్రభుత్వం
- ఉన్నతాధికారుల నిర్ణయం కోసం వేచి చూస్తున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి కొత్త ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. పథకాన్ని రద్దు చేశారని ప్రచారం జరుగుతుండడంతో గత ప్రభుత్వానికి తాము కట్టిన వాటా డబ్బులు తిరిగిచ్చేయాలని గొల్ల, కుర్మ, యాదవులు పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఇప్పటికే జక్రాన్‌పల్లి, మోస్రా, మాక్లూర్ మండలాల నుంచి చాలా మంది వినతిపత్రాలు అందజేశారు. దీంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోక ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వారి నుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు.

గత ప్రభుత్వం రెండో విడత కింద జిల్లాకు 8,384 గొర్రెల యూనిట్ల లక్ష్యాన్ని విధించింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గతేడాది జూన్‌లో కొంతమందికి గొర్రెలను పంపిణీ చేశారు. అనంతరం ఎన్నికల ప్రకటన జారీ కావడంతో పంపిణీ నిలిచిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో గొర్రెల పథకంపై సందిగ్ధత నెలకొంది. కొత్త ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో డీడీలు కట్టి గొర్రెలు అందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

సగం మందికే అందిన గొర్రెలు..

గత ప్రభుత్వ సూచన మేరకు జిల్లాలో రెండు వేల మంది లబ్ధిదారులు ప్రభుత్వానికి డీడీలు కట్టారు. మొత్తం 21 జీవాలుండే ఒక యూనిట్ విలువ రూ. 1.75 లక్షలు ఉండగా, సబ్సిడీ కింద ఒక్కో లబ్ధిదారులు రూ. 43,750 వాటా ధనం చెల్లించారు. డీడీలు కట్టిన వారిలో సీనియార్టీ ప్రకారం జాబితాను తయారు చేసిన పశుసంవర్థక శాఖ అధికారులు జీవాల కోసం లబ్ధిదారులను ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు తీసుకెళ్లారు. ఇలా ఇప్పటివరకు 929 యూనిట్ల గొర్రెలను అందజేశారు. రెండు వేలమంది డీడీలు కడితే సగం మందికే జీవాలు అందగా, ఇంకా 1,071 మందికి అందలేదు. ప్రస్తుతం గొర్రెలను పంపిణీ చేసే విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. ఇదిలా ఉండగా గొర్రెలు అందజేసిన సమయంలో వాటికి బీమా సౌకర్యం కల్పించారు. మృతి చెందిన వాటి స్థానంలో అధికారులు మళ్లీ కొత్త గొర్రెలు కొనివ్వాలి. బీమా విషయంలో కూడా స్పష్టత లేకపోవడంతో అధికారులు మిన్నకుండిపోయారు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు..

గొర్రెల పంపిణీ పథకం అమలుపై కొత్త ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. డీడీలు కట్టిన లబ్ధిదారులు గొర్రెలు కోసం ఎదురు చూస్తున్నారు. పథకం రద్దయిందని జరుగుతున్న ప్రచారానికి కొంతమంది తమ వాటాధనాన్ని తిరిగిచ్చేయాలని వినతులు ఇస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ ద్వారా రాష్ట్ర ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం. వారి నుంచి వచ్చిన ఆదేశాలను అమలు చేస్తాం.
– జగన్నాథచారి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

హైవే విస్తరణకు సన్నాహాలు

- జాతీయ రహదారి-63 వెడల్పునకు ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం
- ఆర్మూర్ నుంచి మంచిర్యాల్ వరకు..
- కొన్ని గ్రామాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- భూ సేకరణ కోసం నోటీసుల జారీ

గ్రామాల వారీగా నష్టపోనున్న భూములు (హెక్టార్లలో)

గ్రామం	విస్తీర్ణం	గ్రామం	విస్తీర్ణం
పడకల్	8.261	మోర్తాడ్	30.154
అంక్సాపూర్	10.954	కమ్మర్‌పల్లి	30.103
కుకునూర్	4.423	మొత్తం	83.895

మోర్తాడ్(బాల్కొండ) : నేషనల్ హైవేల విస్తరణలో భాగంగా ఆర్మూర్ నుంచి మంచిర్యాల్ వరకు 63వ నంబర్ జాతీయ రహదారిని విస్తరించాలని ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) సంస్థ నిర్ణయించింది. ప్రస్తుతం రెండు లైన్ల రోడ్డుగా ఉన్న జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణను త్వరితగతిన చేపట్టడానికి ఎన్‌హెచ్‌ఏఐ రెవెన్యూ శాఖకు ఆదేశాలను జారీ చేసింది. ఆర్మూర్ నుంచి జగిత్యాల్ మీదుగా మంచిర్యాల్ వరకు 131.8 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ. 2,529 కోట్ల నిధులు కేటాయించారు. మొదట్లో ఉన్న జాతీయ రహదారిని విస్తరించాలని నిర్ణయించగా కొన్ని గ్రామాల్లో ఇళ్లు, భవనాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉండడంతో ఆయా చోట్ల బైపాస్ రోడ్లను నిర్మించాలని కొత్తగా ప్రతిపాదించారు. గతంలో జాతీయ రహదారి విస్తరించాలని నిర్ణయించిన సమయంలో జిల్లాలో 26 కిలోమీటర్ల రోడ్డుకు 72.2671 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని గుర్తించారు. ఇప్పుడు చేసిన కొత్త ప్రతిపాదనల్లో బైపాస్ రోడ్లను నిర్మించాలని నిర్ణయించడంతో 83.895 హెక్టార్ల భూమిని సేకరించాల్సిన అవసరం ఏర్పడింది.

వ్యవసాయ భూములకు ముప్పు

హైవే విస్తరణ పనుల్లో భాగంగా బైపాస్ రోడ్ల నిర్మాణం కోసం భూ సేకరణ చేయాలని నిర్ణయించగా వేల్పూర్ మండలం పడిగెల్, అంక్సాపూర్, కుకునూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లిలలో బైపాస్ రోడ్ల నిర్మాణం కోసం 83.895 హెక్టార్ల భూమి అవసమవుతుంది. ఈ భూమి సేకరణ కోసం ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ అధికారికి ఆదేశాలను జారీ చేశారు. సేకరించాల్సిన భూమి సర్వే నంబర్లు, పట్టాదారుల పేర్ల వివరాలతో రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. భూ సేకరణ పూర్తి చేసిన తర్వాత రోడ్ల నిర్మాణం మొదలయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఇప్పటికే వరద కాలువ, రైల్వే లైన్ల నిర్మాణం కోసం ఎంతో విలువైన భూములను కోల్పోయామని ఇప్పుడు జాతీయ రహదారి విస్తరణ, బైపాస్ రోడ్ల నిర్మాణం కోసం భూమి ఇస్తే తాము వ్యవసాయం చేయడానికి భూమి లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.



మోర్తాడ్‌లోని 63వ నంబర్ జాతీయ రహదారి

నెలాఖరులోపు ‘సీఎంఆర్’ పూర్తవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- రైస్‌మిల్లర్లకు తేల్చి చెప్పిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఉల్లంఘనలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు

సుభాష్‌నగర్: నెలాఖరులోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టం మిల్లింగ్ రైస్ నిల్వలను ఎఫ్‌సీఐకి చేరవేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి రైస్‌మిల్లులో పూర్తి సామర్థ్యం మేరకు కస్టం మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈవిషయంలో నిర్లక్ష్యం వద్దని.. నిబంధనలు ఉల్లంఘించే మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమని తేల్చి చెప్పారు. మంగళవారం తన చాంబర్‌లో రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ విషయంలో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని.. మిల్లర్ల అలసత్వాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. లక్ష్యం మేరకు మిల్లర్లు కస్టం మిల్లింగ్ రైస్‌ను అందించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని రైస్‌మిల్లుల్లో ప్రతిరోజూ కనీసం 6వేల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ చేసే సామర్థ్యం ఉన్నా.. కేవలం 2వేల మెట్రిక్ టన్నులే మిల్లింగ్ జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు 35 మిల్లులు ఇంతవరకు సీఎంఆర్ కేటాయింపులను ప్రారంభించలేదని.. నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రైవేటు ధాన్యం మిల్లింగ్‌కు విరామమిచ్చి, సీఎంఆర్ లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, సాధ్యమైనంత వరకు ఎక్కువ బాయిల్డ్ రైస్ నిల్వలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీఎం జగదీశ్, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్ వర్మ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, శ్రవణ్, రైస్‌మిల్లర్లు, పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీ నుంచి నిందితుడు పరారీ

- ప్రత్యేక బృందాల గాలింపు



సాహిల్‌ఖాన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ నుంచి కస్టడీలో ఉన్న గొలుసు చోరీ నిందితుడు మంగళవారం పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన ఘటన కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి సర్కిల్ పరిధిలోని అర్గుల్ గ్రామ వెంకటేశ్వర కాలనీకి చెందిన సువర్ణ బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి చూస్తోంది. అంతలోనే ఆర్మూర్ వైపు నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆమె మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జక్రాన్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు మహమ్మద్ సాహిల్ ఖాన్, అర్షద్ (మాదాపూర్ గ్రామం, ఫరీదాబాద్ జిల్లా, ఫతేపూర్, టగ్గ ప్రాంతం, హర్యానా రాష్ట్రం) లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితులు ఇంకా ఇతర ప్రాంతాల్లో ఏమైనా గొలుసు దొంగతనాలు చేశారా.. అని విచారణ జరిపేందుకు ఈ నెల 6న రాత్రి డిచ్‌పల్లి సర్కిల్‌కు తరలించారు. సర్కిల్ కార్యాలయం పక్కనే ఉన్న డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితులను ఉంచి విచారణ జరుపుతు న్నారు. మంగళవారం ఉదయం నిందితుల్లో ఒకడైన సాహిల్ ఖాన్ కాలకృత్యాలను తీర్చుకుంటానని అడగడంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ అత డిని లాకప్ రూం నుంచి బయటకు తీసి బాత్‌రూంకు తీసుకెళ్లాడు. లోపల నుంచి గడియ వేసుకున్న నిందితుడు బాత్‌రూం వెంటిలేటర్ అద్దాలు తొల గించి పరారయ్యాడు. బాత్‌రూంలోకి వెళ్లిన సాహిల్ ఖాన్ ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో కానిస్టేబుల్ తలుపులు పగులగొట్టి చూడగా లోపల నిందితుడు కన్పించలేదు. వెంటనే కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు ప్ర త్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసు జాగి లాన్ని రప్పించి జాతీయ రహదారి వెంట గాలించి నా ఫలితం లేకుండా పోయింది. నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ నేతృత్వంలో డిచ్‌పల్లి సీఐ కృష్ణ, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, మరికొందరు ఎస్సై ల ఆధ్వర్యంలో ఐడీ పార్టీ పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. నిందితుడు పరారీ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది.



నిందితుడి ఆచూకీ కోసం జాగిలంతో గాలిస్తున్న పోలీసులు

అర్ధరాత్రి పట్టివేత

నిందితుడిని రాత్రి 11.30 గంటల సమయంలో నిజామాబాద్ – నిర్మల్ జిల్లాల సరిహద్దులో పోలీసులు పట్టుకున్నారు. అక్కడి నుంచి డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



పోటీలో తలపడుతున్న తెలంగాణ - విద్యాభారతి జట్లు

నాకౌట్ దశకు కబడ్డీ పోరు

కామారెడ్డిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ కొనసాగుతోంది. మంగళవారం లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. పోటీలు నాకౌట్ దశకు చేరుకున్నాయి.

-వివరాలు 8లో..

రాయితీపై చలాన్ల చెల్లింపునకు నేడే ఆఖరు

- జిల్లాలో 2.25 లక్షల చలాన్లు కట్టిన వాహనదారులు
- సోమవారం నాటికి రూ. 2.50 కోట్ల ఆదాయం

ఖలీల్‌వాడి: రాయితీపై ట్రాఫిక్ చలాన్లను చెల్లించేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశం బుధవారం ముగియనుంది. కొంత మంది వాహనాదారులు చలాన్లను చెల్లించగా మరికొందరు స్పందించడంలేదు. ప్రభుత్వ అధికారులకు సంబంధించిన వాహనాలకు కూడా జరిమానాలు ఉన్నా ఇంకా చెల్లించనట్లు తెలుస్తోంది. వాహనాలకు ఉన్న జరిమానాలను ఆర్టీసీ బస్సులపై 90శాతం, టూ వీలర్, త్రీవీలర్ వాహనాలకు 80శాతం, ఫోర్ వీలర్, భారీ వాహనాలపై 60 శాతం సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించి నేటి వరకు గడువు విధించింది. 2018 నుంచి 2024 జనవరి 8 నాటికి జిల్లాలో 5 లక్షల పెండింగ్ చలాన్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ. 30 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. సోమవారం నాటికి 2.25 లక్షల కేసులకు రూ. 2.50 కోట్లు చెల్లించారు. ఇంకా జిల్లాలో 2.75 లక్షల వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

గడువు పెంచాలంటున్న వాహనదారులు

ప్రజాపాలన కార్యక్రమం కారణంగా ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవడానికి మీ సేవ, ఆధార్ సెంటర్లు ప్రజలతో సందడిగా మారడంతో ట్రాఫిక్ చలాన్లు చెల్లించలేకపోతున్నామని వాహనాదారులు చెబుతున్నారు. ఆన్‌లైన్, పేటీఎం ద్వారా చలాన్లు చె ల్లించడానికి అవగాహన లేకపోవడంతో చెల్లించలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం గడువు పెంచితే చెల్లిస్తామని చెబుతున్నారు.

వెంటనే చెల్లించాలి

రాయితీ ట్రాఫిక్ చలాన్ల చెల్లింపునకు ప్రభుత్వం ఇచ్చిన గడువు బుధవారం ముగుస్తుంది. జిల్లాలోని వాహనదారులు తమ వాహనాలపై ఉన్న చలాన్లను వెంటనే చెల్లించుకోవాలి. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గడువు పెంపునకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.
– నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ, నిజామాబాద్

క్లుప్తంగా

కారుణ్య నియామకాల్లో వింత పోస్టింగ్‌

- నేరుగా ఎస్సై పోస్టులో చేరిన వేణుమాధవ్‌
- ప్రస్తుతం భీమ్‌గల్‌ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న వైనం

ఖలీల్‌వాడి : కారుణ్య నియామకాల్లో భాగంగా ఒక సీఐ మరణిస్తే ఆయన కుటుంబీకులకు పోలీస్‌శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టు స్థాయి ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుంది. కాని జిల్లాలో ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న వేణుమాధవ్‌కు ఆయన తండ్రి సీఐ మేఘనాథ్‌రావు మృతిచెందిన అనంతరం జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టు ఇవ్వాల్సి ఉండగా, సిద్దిపేటకు చెందిన ఓ ప్రజాప్రతినిధి మద్దతుతో నేరుగా ఎస్సై పోస్టులో నియామకమయ్యారు. అక్కడి నుంచి హైదరాబాద్‌ పరిసర ప్రాంతాల్లో పనిచేసిన తర్వాత పదోన్నతి పొంది నిజామబాద్‌ ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేసి భీమ్‌గల్‌ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్నారు. అయితే మరణించిన సీఐ మేఘనాథ్‌రావు కుమారుడు నేరుగా ఎస్సై పోస్టులో నియామకమై అనంతరం సీఐగా పదోన్నతి పొందడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డిని వివరణ కోరగా వేణుమాధవ్‌ పదోన్నతిపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ప్రత్యేక జీవో ద్వారా ఆయన ఎస్సై స్థాయి నుంచి పదోన్నతి పొందుతూ ఇక్కడిదాకా రావడంపై నాకు ఎలాంటి సమాచారం లేదన్నారు. విధుల్లో భాగంగా జిల్లాలో పనిచేస్తున్నారన్నారు.

మేయర్‌ గన్‌మెన్‌ల తొలగింపు

ఖలీల్‌వాడి : నగర మేయర్‌ నీతూకిరణ్‌ భద్రతగా ఉన్న గన్‌మెన్‌లను నాలుగు రోజులక్రితం తొలగించినట్లు ఆలస్యంగా తెలిసింది. మేయర్‌ నీతూకిరణ్‌కు గతంలో నలుగురు గన్‌మెన్లను కేటాయించారు. ప్రస్తుతం నలుగురిని తొలగించడంపై సమాచారం తెలియాల్సి ఉంది.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

బోధన్‌రూరల్‌(బోధన్‌): బోధన్‌ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన వార్లే జ్యోతి (28) అనే వివాహిత ఫిర్యాదు మేరకు ఆమె భర్త వార్లే అశోక్‌పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ మంగళవారం తెలిపారు. కల్దుర్కి గ్రామానికి చెందిన వార్లే జ్యోతికి 2012లో నిర్మల్‌ జిల్లాకు చెందిన అశోక్‌తో వివాహం జరిగింది. పెళ్లయిన ఏడాదికే వరకట్నం కోసం వేధిస్తూ భౌతిక దాడి చేసేవాడని, దీంతో ఇటీవల ఆమె విసిగిపోయి పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. ఈ క్రమంలో భర్త అశోక్‌ కల్దుర్కి గ్రామంలోని భార్య జ్యోతి పుట్టింటికి వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి జ్యోతి బోధన్‌ రూరల్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా భర్త అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మట్కా ఆడుతున్న ముగ్గురిపై..

బోధన్‌రూరల్‌(బోధన్‌) : సాలూర మండలకేంద్రంలో మట్కా ఆడుతున్న ముగ్గురు నిందితులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ మంగళవారం తెలిపారు. పట్టుబడిన నిందుతుల వద్ద నుంచి 2సెల్‌ ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గల్ఫ్‌ శ్రామికులకు గుల్ఫారం గోస

- మద్యం, కృత్రిమ కల్లుకు అలవాటుపడ్డ యువకులు
- గల్ఫ్‌కు వెళ్లాక అక్కడ గుల్ఫారం దొరకక ఇబ్బందులు
- మత్తు కోసం విదేశాల నుంచి తిరిగొస్తున్న వైనం

జిల్లాలోని ఇందల్వాయి మండలానికి చెందిన ఓ వ్యక్తి కృత్రిమ కల్లుకు బానిసయ్యాడు. అనంతరం పనినిమిత్తం బెహరీన్‌ బాటపట్టాడు. కాని స్వదేశంలో కృత్రిమ కల్లుకు బానిసైన అతడు బెహరీన్‌లో కల్లు దొరకక ఆగమై మతిస్థిమితం కోల్పోయి రోడ్లపైకి తిరిగాడు. అక్కడున్న ఓ యువచైతన్య కమిటీ ఆధ్వర్యంలో బాధితుడిని పట్టుకుని వైద్యం చేయించి స్వదేశానికి టికెట్‌ ఇచ్చి పంపారు.

డిచ్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలోని యువకుడు కృత్రిమకల్లుకు బాగా అలవాటు పడ్డాడు. అనంతరం ఉద్యోగనిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడ కృత్రిమ కల్లు దొరకక మతిస్థిమితం కోల్పోయి అక్కడే మృతిచెందగా అతడి మృతదేహం ఏడాది తర్వాత స్వగ్రామానికి చేరింది. మరో సంఘటనలో యువకుడు గల్ఫ్‌కు వెళ్లి అక్కడ గుల్ఫారం కల్లు దొరకక ఆగమై నాలుగురోజులకే స్వగ్రామానికి వచ్చేశాడు.

నిజామాబాద్‌ రూరల్‌ : కల్తీకల్లు కారణంగా ఎంతో మంది యువకుల జీవితాలు బుగ్గిపాలవుతున్నారు. కల్తీకల్లుకు అలవాడు పడి విదేశాలకు వెళ్లి కష్టపడి పనిచేద్దామనుకుంటున్నప్పటికీ అక్కడ కల్తీ కల్లు దొరకక అచేతన స్థితిలో తిరిగి ఇంటిదారి పడుతున్నారు. కొందరు అక్కడే మతిస్థిమితం కోల్పోయి రోడ్లపైన తిరుగుతున్నారు. కృత్రిమ కల్లు సీసా రూ. 10 అయినా ప్రజల ప్రాణాల మీదికి తెస్తోంది. ముఖ్యంగా రోజువారీగా కూలీకి వెళ్లే వారు, కార్మికులు ఎక్కువగా ఈ గుల్ఫారం కల్లుకు బానిసై ఒకటీరెండు రోజులు కల్లు దొరకకపోతే పిచ్చోళ్లలా ప్రవర్తిస్తున్నారు. మహిళల్లో కూడా గుల్ఫారం బాధితులున్నారు.

నవయువకులే ఎక్కువ..

గ్రామాల్లో యుక్తవయస్సులో ఉన్నవాళ్లే ఎక్కువగా కల్తీకల్లు బారిన పడుతున్నారు. తమ విలువైన జీవితాలను ఆగం చేసుకుని కన్న తల్లిదండ్రులకు మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ఇలా యుక్తవయస్సు వాళ్లే కల్లుకు అలవాటు పడిన అనంతరం గల్ఫ్‌ దేశాలైన దుబాయ్‌, బెహరీన్‌, మస్కట్‌, కువైట్‌, సౌదీ ఆరేబీయా, మాల్దీవులకు వెళ్లి అక్కడ ఈ కల్తీ కల్లు దొరకక ఇబ్బందుల పాలై ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతకాలంలో గుల్ఫారం కల్లులో డైజోఫాం, క్లోరోఫాం, శాక్రీన్‌ వంటి మత్తుపదార్థాలు కలిపి కృత్రిమ కల్లును తయారు చేస్తున్నారు. ఒక్కసారి ఈ కల్లుకు అలవాటైన వారు దీనిని మర్చిపోవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గుల్ఫారం కల్లుకు అలవాటు పడిన వాళ్లు గల్ఫ్‌, ఇతర విదేశాలకు వెళ్లకపోతేనే మంచిదని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.



వైద్యుల సలహా తీసుకోవాలి..

మన జిల్లాలో గల్ఫ్‌, ఇతర దేశాలకు వెళ్తున్న వారిలో 50శాతం మందికి కల్తీకల్లుకు అలవాటు పడ్డవాళ్లే ఉన్నారు. ఈ కల్లుబారిన పడిన వాళ్లు అది అందకపోతే విచిత్రంగా ప్రవర్తిస్తారు. అకస్మాత్తుగా ఫిట్స్‌ వస్తాయి. మెదడు పనిచేయని ఈ సమస్యను వైద్యపరిభాషలో ఆల్కహాల్‌ విత్‌ డ్రావెల్‌ సింద్రోం అంటారు. గల్ఫ్‌కి వెళ్లేవాళ్లు, ఆల్కహాల్‌, కల్తీకల్లుకు అలవాటు ఉన్న వాళ్లందరూ ఖచ్చితంగా మానసిక వైద్యుల దగ్గర డీఅడిక్షన్‌ ట్రీట్‌మెంట్‌ తీసుకోవాలి. ఆ తర్వాత విదేశాలకు వెళ్తే ఎలాంటి సమస్యలు రావు.

– డాక్టర్‌ కేశవులు, మానసిక వైద్యనిపుణులు



అటకెక్కిన జియో అటెండెన్స్‌

- నిలిచిన ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియ
- విద్యార్థుల హాజరు మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వైనం
- ఇష్టానుసారంగా స్కూళ్లకు వెళ్తున్న టీచర్లు



నిజామాబాద్‌ అర్బన్‌ : ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సమయపాలన సక్రమంగా ఉండేందుకు గతేడాది కలెక్టర్‌ ఆన్‌లైన్‌ అటెండెన్స్‌ విధానాన్ని తీసుకొచ్చారు. జియో అటెండెన్స్‌ ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాల్లో టీచర్‌ సమయానుకూలంగా వచ్చి ఆన్‌లైన్‌లో అటెండెన్స్‌ నిర్దేశిత సమయానికి నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా పాఠశాలల్లో టీచర్ల అటెండెన్స్‌ క్రమపద్ధతిలో సాగింది. ప్రతి టీచర్‌ సకాలంలో పాఠశాలకు హాజరయ్యారు.

నెలరోజులుగా..

గతేడాది జూన్‌లో జిల్లాలోని 789 ప్రాథమిక పాఠశాలలు, 137 ప్రాథమికోన్నత పాఠశాలలు, 269 ఉన్నత పాఠశాలల్లో 4,897 మంది టీచర్లకు జియో అటెండెన్స్‌ను ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు, యుపీఎస్‌ పాఠశాలలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 నిమిషాల వరకు, ఉన్నత పాఠశాలలకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు జియో అటెండెన్స్‌ నమోదు ఉండేది. ఉదయం సాయంత్రం ఖచ్చితంగా పాఠశాల లోకేషన్‌ ఉండి ఆన్‌లైన్‌ అటెండెన్స్‌ నమోదు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల ప్రతి టీచర్‌ పాఠశాల సమయపాలన ఖచ్చితంగా పాటించేవారు. కాని ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో నెల రోజుల నుంచి ఈ పక్రియ నిలిచిపోయింది. దీంతో కొందరు టీచర్లు ఇష్టానుసారంగా పాఠశాలలకు వెళ్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలలకు గైర్హాజరు కావడం మళ్లీ పెరిగింది. ఆన్‌లైన్‌ అటెండెన్స్‌ విధానం పక్రియ చేపట్టవద్దంటూ ప్రధాన సంఘంతో పాటు కొందరు సంఘం నాయకులు జిల్లా అధికారులపై, పాఠశాల హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకొచ్చి నిలిపేయించారు. దీనివల్ల సమయపాలన గాడితప్పింది. జిల్లాకు దూర ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలలకే వెళ్లట్లేదు. ఇష్టానుసారంగా వెళ్తున్నారు.

విద్యార్థులకు సరిపోతుందని..

పాఠశాలల్లోని విద్యార్థులకు ముఖగుర్తింపు అటెండెన్స్‌ నమోదు చేపడుతున్నారు. విద్యార్థులను ఆన్‌లైన్‌ అటెండెన్స్‌ను కొనసాగిస్తున్నారు. ఇది మాత్రమే సరిపోతుందని కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ఈ పక్రియ కూడా కొన్ని పాఠశాలల్లో సక్రమంగా కొనసాగడం లేదు.

ఆకస్మికంగా తనిఖీ చేస్తాం



ప్రతి టీచర్‌ సమయపాలన పాటించాలి. లేదంటే చర్యలు తీసుకుంటాం. పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాం. ఎవరైన అనుమతి లేకుండా గైర్హాజరైతే తక్షణమే చర్యలు తీసుకుంటాం. జియో అటెండెన్స్‌ విధానంపై పూర్తి దృష్టిసారిస్తాం.

– దుర్గాప్రసాద్‌, డీఈవో

‘రోడ్డు పనులను అడ్డుకుంటున్నారు’

నందిపేట్‌ (ఆర్మూర్‌) : రెండు జిల్లాలను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న రోడ్డు పనులను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందిపేట మండలంలోని కొండూరు శివారు ప్రాంతంలో తమకు నష్టపరిహారం అందలేదని కొందరు రైతులు పనులు చేపట్టకుండా అడ్డుకుంటున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు రైతులతో చర్చించినప్పటికీ పరిష్కారం కాలేదు. నందిపేట నుండి ఉమ్మెడ శివారులో గోదావరిపై నిర్మించిన బ్రిడ్జి వరకు పనులు జరగగా మధ్యలో కొండూరు దాటిన తర్వాత పనులు జరగకుండా రైతులు అడ్డుకున్నారు. దీంతోవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆర్‌ అండ్‌బీ ఏఈ రఘు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాకౌట్‌ దశకు కబడ్డీ పోరు

- హోరాహోరీగా సాగుతున్న పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు
- పూర్తయిన లీగ్‌ దశ..
- నేడు క్వార్టర్‌, సెమీ ఫైనల్‌ మ్యాచ్‌లు



ఉత్తరాఖండ్‌ రైడర్‌ను పట్టేసిన వెస్ట్‌బెంగాల్‌ జట్టు



కేరళ రైడర్‌ను పట్టేసిన మహారాష్ట్ర టీం సభ్యులు



ప్రత్యర్థి జట్టు రైడర్‌ను పట్టేసిన తెలంగాణ క్రీడాకారులు

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్‌ ఆధ్వర్యంలో అండర్‌–17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ కొనసాగుతోంది. మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. మంగళవారం లీగ్‌ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. పోటీలు నాకౌట్‌ దశకు చేరుకున్నాయి. ఇక గెలిచిన వారే ముందుకు వెళ్లనున్నారు. ఓడిన జట్టు ఇంటిబాట పట్టాల్సిన పరిస్థితుల్లో పోటీలు మరింత ఉత్కంఠగా జరిగే అవకాశాలున్నాయి. బుధవారం క్వార్టర్స్‌, సెమీ ఫైనల్‌ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

ఉదయం 12 మ్యాచ్‌లు..

మైదానంలో ఏర్పాటు చేసి నాలుగు కోర్టులలో మూడు రౌండ్ల చొప్పున ఉదయం 12 మ్యాచ్‌లు జరిగాయి. తెలంగాణ జట్టు విద్యాభారతి జట్టుతో ఆడిన మ్యాచ్‌ ఉత్కంఠగా సాగింది. ఈ మ్యాచ్‌ను చూసేందుకు ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. ఇందులో తెలంగాణ జట్టు 49 –34 తేడాతో విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్‌ జట్టు ఝార్ఖండ్‌పై 67–39 పాయింట్లతో గెలిచింది. కర్ణాటక జట్టు 84–20 పాయింట్ల భారీ తేడాతో జమ్మూకశ్మీర్‌ జట్టుపై గెలుపొందింది. విద్యాభారతి, ఉత్తరాఖండ్‌ జట్ల మధ్య మ్యాచ్‌ ఉత్కంఠ భరితంగా సాగింది. ఇందులో 39–38 పాయింట్లతో విద్యాభారతి జట్టు గెలిచింది. ఢిల్లీ జట్టు పాండిచ్చేరి జట్టుపై 42–30 పాయింట్లతో, ఢిల్లీ జట్టు తమిళనాడుపై 45–33తో, హిమాచల్‌ప్రదేశ్‌ జట్టు సీబీఎస్‌ఈడబ్ల్యూవో జట్టుపై 81–28 పాయింట్లతో, బీహార్‌ జట్టు సీఐఎస్‌సీఈ జట్టుపై 54–23తో, రాజస్థాన్‌ జట్టు మధ్యప్రదేశ్‌పై 51–40తో, ఒడిషా జట్టు చండీఘడ్‌ జట్టుపై 58–53 పాయింట్లతో విజయం సాధించాయి.

మధ్యాహ్నం ప్రీ క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌లు..

మధ్యాహ్నం ప్రీ క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌లు నిర్వహించారు. చత్తీస్‌ఘడ్‌తో జరిగిన హోరాహోరా పోటీలో తెలంగాణ జట్టు 27– 34 పాయింట్ల తేడాతో ఓ డింది. ఢిల్లీ జట్టు గుజరాత్‌ జట్టుపై 33–31 పాయింట్లతో, హిమాచల్‌ప్రదేశ్‌ జట్టు కేవీఎస్‌పై 39–36తో, విద్యాభారతి జట్టు మధ్యప్రదేశ్‌పై 40–31 పాయింట్లతో, హర్యానా జట్టు తమిళనాడుపై 62–22 తో, మహారాష్ట్ర జట్టు పంజాబ్‌పై 35–24తో గెలిచింది.

ఎంపీటీసీల సంతకాల పరిశీలన

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్‌ అలియాస్‌ భూమయ్య, వైస్‌ఎంపీపీ కులాచారి శ్యాంరావు లపై 12 మంది ఎంపీటీసీలు ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు సోమవారం అవిశ్వాస తీర్మానం లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ లేఖలో పెట్టిన సంతకాలు ఆయా ఎంపీటీసీలవి అవునో కాదో నిర్ధారించాలని కోరుతూ ఆర్డీవో మంగళవారం డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయానికి పంపించారు. ఎంపీడీవో టీవీఎస్‌ గోపిబాబు అవిశ్వాస తీర్మానం లేఖపై ఉన్న 12 మంది ఎంపీటీసీ సంతకాలను వెరిఫై చేసి అవి నిజమైన సంతకాలేనని ఆర్డీవోకు నివేదించారు. ఈ నివేదిక ఆధారంగా 15 రోజుల లోపు ఎంపీపీ, వైస్‌ ఎంపీపీల అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఆర్డీవో తేదీని నిర్ణయించి, ఎంపీటీసీలకు నోటీసు అందజేస్తారు. డిచ్‌పల్లి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ పార్టీలో పలువురు బీఆర్‌ఎస్‌ పార్టీ ఎంపీటీసీలు చేరడంతో వీరి సంఖ్య 9 కి చేరింది. మిగిలిన వారిలో ఎంపీపీ, వైస్‌ ఎంపీపీతో కలిసి మరో ఇద్దరు ఎంపీటీసీలు (నలుగురు) బీజేపీకి చెందిన వారు కాగా నలుగురు ఎంపీటీసీలు బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. వీరిలో కాంగ్రెస్‌ ఎంపీటీసీలతో పాటు ముగ్గురు బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం లేఖపై సంతకాలు చేశారు. ముల్లంగి (ఐ) గ్రామానికి చెందిన నడిపల్లి–2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్యను ఎంపీపీగా, అమృతాపూర్‌ ఎంపీటీసీ దండుగుల సాయిలును వైస్‌ఎంపీపీని ఎన్నుకోనున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్‌

2 కిలోల గంజాయి స్వాధీనం



బోధన్‌టౌన్‌(బోధన్‌) : బోధన్‌ పట్టణంలోని అనీసానగర్‌ కాలనీలో గంజాయి అమ్ముతున్న వ్యక్తితో పాటు సరఫరా చేస్తున్న మహారాష్ట్రలోని కొండల్‌వాడి గ్రామానికి చెందిన మహిళ నుంచి 2 కిలోల గంజాయిని పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌ కుమార్‌ తెలిపారు. మంగళవారం రాత్రి బోధన్‌లోని ఏసీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బోధన్‌ పట్టణంలోని అనీసా నగర్‌ కాలనీకి చెందిన షేక్‌ అహ్మద్‌ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నాడని పట్టణ ఎస్‌ఐ మహేందర్‌కు వచ్చిన సమాచారం రాగా పోలీసులతో కాలనీకి వెళ్లి గంజాయి విక్రయిస్తున్న షేక్‌ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా తాను గంజాయిని యువకులకు, కూలీలకు విక్రయిస్తానని, మహారాష్ట్రలోని కొండల్‌వాడి గ్రామానికి చెందిన సార్వతిభాయి నుండి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతానని పేర్కొన్నాడన్నారు. షేక్‌ అహ్మద్‌ ఇచ్చిన సమాచారం మేరకు మహారాష్ట్రలోని కొండల్‌వాడికి పార్వతిభాయి ఇంటికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా తనకు నాందేడ్‌కు చెందిన అహ్మద్‌, నాయ్‌గావ్‌కు చెందిన చౌహాన్‌లు గంజాయిని సరఫరా చేస్తారని వెల్లడించిందన్నారు. వీరి ఇద్దరిపై గంజాయి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ వీరయ్య, ఎస్‌ఐ మహేందర్‌, సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో జర్నలిస్ట్‌ మృతి



గోనె లాలయ్య(ఫైల్‌)

బిచ్కుంద(జుక్కల్‌) : మండల కేంద్రానికి చెందిన సీనియర్‌ జర్నలిస్టు గోనె లాలయ్య(45) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. స్నానానికి బాత్‌రూంలోకి వెళ్లిన ఆయన గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆయన 20 ఏళ్లుగా జర్నలిస్టుగా పని చేస్తున్నారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, ఎంపీపీ అశోక్‌, ఏఎంసీ చైర్మన్‌ నాగనాథ్‌, నాల్చర్‌రాజు, కమల్‌కిషోర్‌ కుటుంబానికి పరామర్శించి సంతాపం తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ దాడి

ఖలీల్‌వాడి : నగరంలోని ఆరవ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బాబన్‌ సాబ్‌పహాడ్‌ సమీపంలోని కమేలా వద్ద పేకాటాడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ రాజశేఖర్‌ రాజు ఆదేశాల మేరకు సీఐలు అంజయ్య, అజయ్‌బాబు, సిబ్బంది దాడిచేసి 16 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌ చేసి వారి నుంచి రూ.39,420 స్వాధీనం చేసుకున్నారు.

బ్యాటరీల చోరీ ముఠా అరెస్ట్‌

- బీఎస్‌ఎన్‌ఎల్‌ టవర్ల నుంచి అపహరణ
- ఆరుగురిని పట్టుకున్న పోలీసులు
- 72 బ్యాటరీలు, రూ. 1.50 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి



పట్టుబడిన నిందితులతో పోలీసులు

బాన్సువాడ : బీఎస్‌ఎన్‌ఎల్‌ టవర్ల వద్ద బ్యాటరీలనే టార్గెట్‌ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాన్సువాడ మండలం కొయ్యగుట్ట వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కారులో ఆరుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని విచారించామన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా నారాయణ్‌పూర్‌కు చెందిన వుడెం అరుణ్‌కుమార్‌, టవర్లలో గ్రీస్‌క్లీనర్‌గా పని చేసే ఆర్మూర్‌కు చెందిన బోడమీది రవి, జువ్వాడికి చెందిన గొలుసు లింగం, మ్యాతరి సాయిలు, గైని మైశయ్యలు ఐదుగురు కలిసి ఈనెల 2న తాడ్కోల్‌ శివారులో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్‌ టవర్‌ వద్ద బ్యాటరీలను దొంగతనం చేస్తుండగా టవర్‌ వద్ద టెక్నీషియన్‌గా పనిచేసే వ్యక్తి రాగా అతనిని చూసి వీరు పారిపోయారన్నారు. చోరీ చేసేందుకు మరో చోటకు వెళ్తున్న క్రమంలో పట్టుకున్నామన్నారు. జిల్లాలో వివిధ బీఎస్‌ఎన్‌ఎల్‌ టవర్ల వద్ద 264 బ్యాటరీలను దొంగతనం చేశారన్నారు. వాటిని కామారెడ్డిలోని పాత సామాగ్రి కొనుగోలు చేసే ఖలీంకు విక్రయించారన్నారు. వీటిలో నుంచి 74 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నామని, మిగితా బ్యాటరీలను హైదరాబాద్‌లో ఖలీం విక్రయించాడన్నారు. ఖలీం నుంచి రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న బ్యాటరీలతో పాటు నగదు కలిపి రూ. 6 లక్షల విలువ ఉంటుందన్నారు. ఐదురుగురితో పాటు ఖలీంను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ముఠాను పట్టుకున్న బాన్సువాడ టౌన్‌ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు చంద్రన్న, జగన్నాథ్‌, సిబ్బంది గంగారం, అశోక్‌లకు అవార్డుల కోసం ఎస్పీకి విన్నవిస్తామని అన్నారు.

టీమార్ట్‌లో అగ్ని ప్రమాదంపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలో రెండేళ్ల క్రితం టీమార్ట్‌ సూపర్‌మార్కెట్‌లో అగ్ని ప్రమాదంపై సీపీ కల్మేశ్వర్‌కు టీమార్ట్‌ నిర్వాహకుడు నేతి శేఖర్‌ మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం నేతి శేఖర్‌ మాట్లాడుతూ నగరంలోని ఆర్యనగర్‌ సబ్‌స్టేషన్‌ ఎదురుగా టీ–మార్ట్‌ సూపర్‌ మార్కెట్‌ నడుపుతున్నట్లు తెలిపారు. 2022 ఆగష్టు 27న శనివారం తెల్లవారుజామున టీమార్ట్‌లో మంటలు చెలరేగాయని స్థానికులు చెప్పడంతో తాను అక్కడికి వెళ్లాలని అప్పటికే ఫైర్‌ఇంజిన్‌ మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తోందన్నారు. మరుసటి రోజు నాల్గో టౌన్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఫిర్యాదులో నేతి శ్రీనివాస్‌, శేఖర్‌, ఎం.ఉదయ్‌ కుమార్‌, శివరాత్రి సంతోష్‌పై కేసు నమోదు చేశారని, ఇప్పటికీ వారిని కోర్టుకు సబ్మిట్‌ చేయలేదన్నారు. అగ్నిప్రమాదంలో రూ. 2.50 కోట్లు నష్టపోయానని, షాప్‌ అగ్నిప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీని కోరామన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాదర్బార్‌లో సైతం సీఎం రేవంత్‌ రెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజేశ్‌ (ఫైల్‌)

ఇందల్వాయి : అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన విషాధకర ఘటన మంగళవారం ఇందల్వాయి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇందల్వాయి గ్రామానికి చెందిన కుమ్మరి గంగారాం, సాయమ్మల ఒక్కగానొక్క కొడుకు రాజేష్‌ (19) ఇంటర్‌ అనంతరం హైదరాబాద్‌లో ప్రైవేట్‌ కంపెనీలో జాబ్‌ చేస్తున్నాడు. అయితే ఆర్మీలో ఉద్యోగం పొందాలనే ఆశయంతో ఇటీవలే ఇంటికి వచ్చాడు. కౌలు రైతయిన తన తండ్రికి సాయం చేసేందుకు మంగళవారం సాయంత్రం బైక్‌పై పొలం వద్దకు వెళ్తుండగా ఇందల్వాయి తండా నుంచి వేగంగా వచ్చిన మరొక బైక్‌ ఢీకొట్టింది. కిందపడ్డ రాజేష్‌ తలకు తీవ్ర గాయమై ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంలో ఇందల్వాయి తండా నుంచి వస్తున్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలు కాగా వారిని ఆస్పత్రికి తరలించారు. రాజేష్‌ మృతదేహంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టగా డిచ్‌పల్లి సీఐ వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవీపేట(బోధన్‌) : జానకంపేట–నిజామాబాద్‌ రైల్వేస్టేషన్ల మధ్య మల్కాపూర్‌–గుందారం శివారులో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు నిజామాబాద్‌ రైల్వే ఎస్సై సాయిరెడ్డి పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిస్తే రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ జాన్‌ 9440516146ను సంప్రదించాలన్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో జైలు శిక్ష

ఖలీల్‌వాడి : గతేడాది డిసెంబర్‌ 31న డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి నిజామాబాద్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ సయ్యద్‌ ఖాదిర్‌ జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. ధర్పల్లి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు 8 రోజులు జైలు శిక్ష, జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరికి 3రోజుల జైలుశిక్ష విధించారు.